క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్ కల్లు మండువా, ఎఫ్‌సీఐ కాలనీ, అరుణోదయ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, శివసాయి కాలనీ, శ్రీనివాస కాలనీ, కృష్ణా కాలనీ, వినాయక కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



మడికొండ: కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన దువ్వ గణేష్‌కు చికిత్స నిమిత్తం రూ.3లక్షల 50 వేల విలువగల ఎల్‌ఓసీని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన అధ్యక్షుడు కుర్ల మోహన్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, 46వ డివిజన్ అధ్యక్షుడు నాగరాజు, బైరి లింగమూర్తి గౌడ్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.రంజిత్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ పనిచేసిన ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి నుంచి రంజిత్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసి బదిలీపై సుబేదారికి రంజిత్‌కుమార్ వచ్చారు. ఇక్కడ పనిచేసిన సత్యనారాయణ రెడ్డి టాస్క్‌ఫోర్స్‌కు వెళ్లారు.

ఆలయంలో ఇన్‌స్పెక్టర్ల పూజలు



హన్మకొండ అర్బన్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన సుబేదారి, హనుమకొండ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు ఎం.రంజిత్‌కుమార్, ఎం.శివకుమార్.. నగరంలోని ఏషియన్ మాల్ సమీపంలోని సాయిబాబా మందిరాన్ని గురువారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ఆలయ ధర్మకర్తలు వెయ్యిగండ్ల రమేష్, నిమ్మల శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజారులు కిషోర్ శర్మ, మణిశర్మ, చందు పూజలు నిర్వహించి ఇన్‌స్పెక్టర్లకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పేదల గుడిసెలు కూల్చొద్దు

న్యూశాయంపేట: హసన్‌పర్తి మండల కేంద్రానికి సమీపంలోని ఎస్సారెస్పీ భూములకు ఆనుకొని కొనేళ్లుగా గుడిసెలు వేసుకుని పేదలు నివాసముంటున్నారని, ఆ గుడిసెలను తొలగించవద్దని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి కోరారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడుతూ గుడిసెవాసులను ఎస్సారెస్పీ సిబ్బంది, పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేదల జోలికి అధికారులు వెళ్లకూడదని హితవు పలికారు. పేదలకు ప్రభుత్వం భూమిని కేటాయించి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సూచించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



కాజీపేట: కాజీపేట 62, 63వ డివిజన్ల పరిధిలో ఐలయ్య నగర్, తిలక్ నగర్ కాలనీల్లో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సహకారంతో సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం



హసన్‌పర్తి: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి లీగల్ అడ్వైజర్ అనూష అన్నారు. 65వ డివిజన్ సుబ్బయ్యపల్లిలో సఖి వన్‌స్టాప్, సర్వోదయ, మహిళా, శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఖి వన్‌స్టాప్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఐదు రకాల సేవలను బాధిత మహిళలు, బాలికలు వినియోగించుకోవాలని సూచించారు. సఖి సెంటర్ 24 గంటలపాటు అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రభాకర్, సఖి కేస్ వర్కర్ భారతి, సీసీలు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న తాగునీరు

- ఆరు నెలలకు పైగా పైపులైన్ లీకేజీ
- పట్టించుకోని అధికారులు



లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

హన్మకొండ: పైపులైన్ లీకేజీలతో తాగునీరు వృథాగా పోతున్నా వరంగల్ మహానగర పాలక సంస్థ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులో తిరుమల బార్ ఎదురుగా నెలల తరబడి పైపులైన్ లీకేజీలతో తాగునీరు వృథా అవుతోంది. గంటల తరబడి నీరు వృథా అవుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తగినన్ని నీళ్లు రావడం లేదని వాపోతున్నారు. ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగిస్తున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి లీకేజీలు కనబడడం లేదా అని విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరారు.

విద్యార్థినులు నైపుణ్యాలు పెంచుకోవాలి



శిక్షణ పొందిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ జ్యోతి

కేయూ క్యాంపస్: ప్రాంగణ నియామకాలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థినులు పెంచుకోవాలని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వర్సిటీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి సూచించారు. యూనివర్సిటీ మహిళా కళాశాలలోని ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్స్ ద్వితీయ సంవత్సరం పూర్తైన విద్యార్థినులకు మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ సహకారంతో వారం రోజులపాటు నైపుణ్యాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. తరగతుల ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ త్వరలోనే ప్రాంగణ నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కాగా, మహిళా పీజీ కళాశాల ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ భాగ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కవిత, మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు విక్రమ్, రాజేష్, లాంగ్వేజ్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ మాక్ ఇంటర్వ్యూ డిసిషన్ మేకింగ్ స్కిల్స్ రెస్యూమ్ రైటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి తాత్కాలిక పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13నుంచి 19వ తేదీ వరకు డైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఈనెల 28న వెల్లడిస్తామని తెలిపారు.

ఆటపాటలతో విద్యనందించాలి



బడిబాటలో డిప్యూటీ మేయర్ రిజ్వాన, టీచర్లు

ఖిలా వరంగల్: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందించాలని నగర డిప్యూటీ మేయర్ రిజ్వాన మసూద్ సూచించారు. బాడిబాట కార్యక్రమంలో భాగంగా వరంగల్ 36వ డివిజన్ చింతల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ సునీత ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిజ్వాన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని అందించాలని చెప్పారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు.

ప్రైవేట్ పాఠశాలలను మూసివేయాలి



విద్యారణ్యపురి: ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ బాధ్యులు

విద్యారణ్యపురి: నగరంలో అనుమతిలేని ప్రైవేట్ పాఠశాలలను మూసివేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు టీచర్స్‌కాలనీ సమీపంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ నగరంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. అయినప్పటికీ విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ధర్నా కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బాధ్యులు చెన్నూరి సాయికుమార్, అభిషేక్, ప్రదీప్, రూపేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని స్కూల్‌ను సీజ్ చేయాలి

హసన్‌పర్తి: అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పలివేల్పులలోని టాపర్మెంట్ స్కూల్‌ను సీజ్ చేయాలని ఐఏఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతికి గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

కేడీసీలో స్వచ్ఛభారత్



పరిసరాలను శుభ్రం చేస్తున్న అధ్యాపకులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈమేరకు కళాశాల ప్రాంగణంలోని చెత్తాచెదారాన్ని తొలగించారు. పిచ్చి మొక్కలను ఏరివేసి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రజనీలత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సంధ్యారాణి, సీతారాములు, గన్‌సింగ్, గంగిశెట్టి శ్రీనివాస్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఏనుగులగడ్డ ఖబ్రస్థాన్‌ను కాపాడాలి



వినతిపత్రం అందిస్తున్న ఐక్యసంఘాల నేతలు

న్యూశాయంపేట: హనుమకొండ ఏనుగులగడ్డలోని ఖబ్రస్థాన్ స్థలం అన్యాక్రాంతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ ఆల్ పార్టీ అండ్ ముస్లిం మైనారిటీ సంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. ఈమేరకు కలెక్టర్ ప్రావీణ్యకు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఈ స్థలం కేసు హైకోర్టు పరిధిలో ఉందని పేర్కొన్నారు. ఈ స్థలంలో ఆర్టీసీ బస్‌షెల్టర్ నిర్మాణం కోసం ప్రభుత్వం ఇటీవల రూ.50 లక్షల నిధులు కేటాయించినట్లు పత్రికల్లో వార్త ప్రచురితమైందని తెలిపారు. ముస్లింల మనోభావాలకు వ్యతిరేకంగా ఖబ్రస్థాన్ స్థలంలో ఎలాంటి నిర్మాణం చేపట్టకుండా చూడాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మైనారిటీ ఇంటెలెక్చువల్ ఫోరం కన్వీనర్ డాక్టర్ అనీస్ సిద్ధిఖీ, ఉమ్మడి వరంగల్ జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షుడు బాబా ఖాదర్‌అలీ, మైనారిటీ ఐక్య వేదిక నాయకుడు మహ్మద్ నయీం, ఎంఐఎం పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షైజుల్లా, కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ సమద్, బీఆర్ఎస్ నాయకుడు ఇస్మాయిల్, యూత్ నాయకులు తౌసిఫ్‌అహ్మద్, అజర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో ముప్పు



మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్లు

హన్మకొండ చౌరస్తా: ప్లాస్టిక్ రహిత డివిజన్ కోసం ప్రతిఒక్కరూ సహకరించాలని 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు కోరారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వంద రోజుల కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని ఉజిలీబేస్, మచిలీబజార్‌లలో పారిశుద్ధ్యంపై గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పర్యావరణానికి ప్రమాదం కలిగించే ప్లాస్టిక్‌ను ప్రజలు తరిమికొట్టాలని సూచించారు. కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కుమార్‌యాదవ్, సతీష్, రాకేష్, జాఫర్, మున్సిపల్ జవాన్లు రమేష్, శ్యామ్ పాల్గొన్నారు.

శ్మశానం కబ్జా.. అధికారులకు ఫిర్యాదు



ఆర్ఐకి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామంలోని శ్మశాన వాటిక స్థలం కబ్జాకు గురైంది. ఈమేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్‌కు గ్రామస్తులు గురువారం ఫిర్యాదు చేశారు. వంగపహాడ్ గ్రామ సర్వే నంబర్లు 9, 13లో సుమారు 6.10 ఎకరాల భూమిని 2006లో ప్రభుత్వం శ్మశాన వాటికకు కేటాయించిందని ప్రజలు తెలిపారు. గ్రామంలో వివిధ వర్గాలు ఈ శ్మశాన వాటికను వినియోగించుకుంటున్నాయని చెప్పారు. కొంతకాలంగా ఈ ప్రాంతానికి చెందిన అశోక్, గండు అయిలయ్యతో పాటు నర్సయ్యపల్లికి చెందిన రవి కలిసి శ్మశాన వాటిక కబ్జాకు యత్నిస్తూ నిర్మాణాలు కూడా చేపట్టారని పేర్కొన్నారు. ఈక్రమంలో సుమారు మూడెకరాలు కబ్జాకు గురైనట్లు ఫిర్యాదులో తెలిపారు. అధికారులు స్పందించి శ్మశాన వాటికకు హద్దులు నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానికులు సదానందం, టి.రవీందర్, రాజేందర్, పైడి, గోనెల సదానందం, భిక్షపతి పాల్గొన్నారు.

ఘనంగా సుజనహిత చిట్‌ఫండ్స్ వార్షికోత్సవం



బండారి శేఖర్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న చిట్ సభ్యులు, ఉద్యోగులు

హన్మకొండ: సుజనహిత చిట్‌ఫండ్స్ 6వ వార్షికోత్సవాన్ని యాజమానులు, ఖాతాదారులు ఘనంగా జరుపుకున్నారు. హనుమకొండలోని కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో చిట్ ఫండ్స్ చైర్మన్ బండారి శేఖర్ గౌడ్ కేక్ కట్ చేసి మాట్లాడారు. 6 ఏళ్ల నుంచి ఖాతాదారుల పాదుపులో సుజనహిత చిట్‌ఫండ్స్ విశ్వసనీయ భాగస్వామిగా ఉంటూ వారి ఆర్థిక అవసరాలను తీరుస్తూ నమ్మకంగా పనిచేస్తోందని వివరించారు. భవిష్యత్‌లోనూ ఖాతాదారులకు నమ్మకంగా ఉంటూ, వారి ఆర్థిక లక్ష్యాలను సాధనకు సంస్థ తోడ్పాటు అందిస్తోందని భరోసా ఇచ్చారు. ఖాతాదారులకు సకాలంలో ప్రైజ్ మనీ అందిస్తూ, పారదర్శకంగా, నిబద్ధతతో పనిచేస్తున్నట్లు తెలిపారు. 7వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఖాతాదారులు, మార్కెటింగ్ మిత్రులు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ గుడిపాటి జనార్ధన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆరు గేదెల మృత్యువాత



మృత్యువాత పడిన గేదెలు

హసన్‌పర్తి: విద్యుదాతానికి గురై ఆరు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లిలో గురువారం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈమేరకు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానికుల కథనం ప్రకారం మల్లారెడ్డిపల్లికి చెందిన బుర్గు రమేష్, బుర్గు నవీన్, బుర్గు సందీప్, బుర్గు కుమార్, భగవాన్‌రెడ్డికి సంబంధించిన గేదెలు గురువారం ఉదయం మేతకు వెళ్లాయి. ప్రమాదవశాత్తు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో విద్యుత్ షాక్‌కు గురై మృత్యువువాత పడ్డాయి. ఒక్కో గేదె విలువ సుమారు రూ.80 వేల నుంచి రూ.90 వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ డిమాండ్ చేశారు.

సంక్షిప్తంగా

ఓబీసీల పోరుబాట పుస్తకం ఆవిష్కరణ

నయింనగర్: మధ్యప్రదేశ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి, హైకోర్టు న్యాయవాది పృథ్వీరాజ్ సింగ్ సంయుక్తంగా రచించిన ఓబీసీల పోరుబాట పుస్తకాన్ని హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆలయ ఫౌండేషన్ అధ్యక్షుడు పరికిపండ్ల వేణు, బీసీ జన అధికార సమితి స్టేట్ జనరల్ సెక్రటరీ పద్మజాదేవి గురువారం ఆవిష్కరించారు.

డ్రెయినేజీల్లో పూడికతీత

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ షాలోమ్ చర్చి ప్రాంతంలో డ్రెయినేజీల్లో పూడికతీత పనులను గురువారం ప్రారంభించినట్లు కాంగ్రెస్ నాయకులు షేక్ అజ్గర్, మైసారపు సిరిల్ లారెన్స్ తెలిపారు.

రాయల ప్రభాకర్‌రావుకు సన్మానం

కేయూ క్యాంపస్: అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, లా అండ్ ఆర్డర్ ట్రాఫిక్ వరంగల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాయల ప్రభాకర్‌రావును పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య గురువారం సన్మానించారు.

టీపీసీసీ ఉపాధ్యక్షుడికి సన్మానం

కాజీపేట రూరల్: టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియామకమైన నమిండ్ల శ్రీనివాస్‌ను ఆయన స్వగృహంలో కాజీపేట 47వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం అభినందించారు. కార్యక్రమంలో నాయకులు సందెల విజయ్‌కుమార్, రడపాక కిషన్, చింటు, జావిద్, చిన్న పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్ల మార్పు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డివిజన్ విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లలో మార్పు జరిగింది. బీఎస్ఎన్ఎల్ నంబర్ల స్థానంలో ఎయిర్ టెల్ నంబర్లను యాజమాన్యం కేటాయించింది. టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ మొబైల్ నంబర్ 8712484447, హనుమకొండ టౌన్ డీఈ 8712484690, హనుమకొండ ఏడీఈ 8712484759, నయింనగర్ ఏడీఈ 8712484463, కాజీపేట ఏడీఈ 8712484758, హనుమకొండ టౌన్ ఈఆర్ఓ ఏఏఓ 8712484749, కాజీపేట ఈఆర్ఓ ఏఏఓ 8712484726, నక్కలగుట్ట ఏఈ 8712484695, హనుమకొండ చౌరస్తా ఏఈ 8712484793, సుబేదారి ఏఈ 8712484703, మచిలీబజార్ ఏఈ 8712484760, నయింనగర్ ఏఈ 8712484734, గోపాల్‌పూర్ ఏఈ 8712484727, యాదవ నగర్ ఏఈ 8712484745, నిట్ ఏఈ 8712484720, కాజీపేట ఏఈ 8712484717, వడ్డేపల్లి ఏఈ 8712484725, మడికొండ ఏఈ 8712484794, కడిపికొండ 8712484715, నక్కలగుట్ట సబ్ స్టేషన్ 8712484700, నక్కలగుట్ట సెక్షన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ 8712484698, హనుమకొండ చౌరస్తా ఫ్యూజ్ ఆఫ్ కాల్ 8712484691, మచిలీబజార్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ 0870 – 2461605, కలెక్టరేట్ సబ్ స్టేషన్ 8712484704, శాయంపేట సబ్‌స్టేషన్ 8712484707, సుబేదారి ఫ్యూజ్ ఆఫ్ కాల్ 8712484709, నయింనగర్ సెక్షన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ 8712484768, గోపాల్‌పూర్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ 8712484728, యాదవ నగర్ సబ్ స్టేషన్ 8712484744, యాదవ నగర్ సెక్షన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ 8712484748, నిట్ సెక్షన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ 8712484791, వడ్డేపల్లి సబ్ స్టేషన్ 8712484802, వడ్డేపల్లి సెక్షన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ 8712484785, వెస్ట్ సిటీ సబ్ స్టేషన్ 8712484797, కాజీపేట సెక్షన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ 8712484798, మడికొండ సబ్ స్టేషన్ 8712484783, మడికొండ టెక్స్‌టైల్స్ సబ్ స్టేషన్ 8712484784, రాంపూర్ సబ్‌స్టేషన్ 8712484790, టేకులగూడెం సబ్‌స్టేషన్‌కు 8712484801 నంబర్‌ను ఎన్పీడీసీఎల్ సంస్థ కేటాయించింది.

భూ పోరాటాలు నిర్వహిస్తాం: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న మేకల రవి

ఖిలా వరంగల్: ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు కట్టించే వరకు భూపోరాటాలు నిర్వహిస్తామని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట అంబేడ్కర్‌నగర్‌లో జన్ను రాజు, గజవెల్లి చిరంజీవి అధ్యక్షతన ప్రథమ మహాసభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి స్థలం లేని నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని అన్నారు. బొల్లికుంట గ్రామ శివారులో ప్రభుత్వ భూమిలో సీపీఐ ఆధ్వర్యంలో ఎర్రజెండాలు పాతిన తరువాత అది ప్రభుత్వ భూమి అని అధికారులు బోర్డు పెట్టారని గుర్తుచేశారు. ఈ భూమిలో పేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాషుమియా, పనాస ప్రసాద్, మండల కార్యదర్శి సభ్యులు గన్నారపు రమేష్, ఓర్సు రాజు, జాన్‌పాల్, అక్బర్‌పాషా, ఆరెల్లి రవి, యాకూబ్, సువర్ణ, బాబు రమేష్ గౌడ్, కుమార్ ప్రభాకర్, కరుణాకర్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు ఎత్తివేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాజీపేట అర్బన్ / మడికొండ: కాజీపేట మండలం మడికొండ – రాంపూర్ గ్రామాల మధ్యలో ఉన్న డంపింగ్ యార్డును వెంటనే ఎత్తివేయాలని సీపీఐ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు కాజీపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించి, ఆర్ఐ శివకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లేష్ మాట్లాడుతూ డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగతో ఆయా గ్రామస్తులు శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, జల, వాయు కాలుష్యం అవుతోందని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు మునిగాల భిక్షపతి, వేల్పుల సారంగపాణి, పూర్ణచందర్, మద్దెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు పునఃప్రారంభం



జయగిరి ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు



కరీమాబాద్ పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ రమేష్



కడిపికొండ ప్రైమరీ స్కూల్‌లో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



భీమారం ప్రభుత్వ పాఠశాలలో యూనిఫాం అందజేస్తున్న కార్పొరేటర్ జక్కుల రజిత



కాజీపేట దర్గా పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంతో విద్యార్థులు



కరీమాబాద్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ మరుపల్లి రవి

అహ్మదాబాద్ విమాన దుర్ఘటన బాధాకరం

హన్మకొండ: గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం కూలిపోవడం శోచనీయమని, పలువురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పేర్కొన్నారు.

చట్టబద్ధమైన కమిటీకి అనుమతివ్వాలి

హన్మకొండ అర్బన్: న్యూశాయంపేటలోని రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన రజక మడివెల మాచిదేవ భవనం ట్రస్టీల పేరుతో 13మంది రజక కులం పేరుతో శాశ్వత జీవితకాల ట్రస్టీలుగా అనుభవించే కుతంత్రం చేస్తున్నారని తెలంగాణ రజ నవ నిర్మాణ సంఘం అధ్యక్షుడు చీకటి రాజు తెలిపారు. చట్టబద్ధమైన కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ సంఘం నాయకులతో కలిసి హైదరాబాద్‌లో తెలంగాణ వాషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

భర్త గొంతు కోసిన భార్య బంధుమిత్రులు

రామన్నపేట: దుబాయికి భర్త వెళ్లడం లేదని ఘర్షణకు దిగిన భార్య, తన బంధుమిత్రులతో కత్తితో దాడి చేసి గొంతు కోసిన ఘటన వరంగల్ మండిబజార్‌లో చోటుచేసుకుంది. ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూరు తెలిపిన వివరాల ప్రకారం మండిబజార్‌కు చెందిన కబీర్ హుల్ రెహమాన్ జీవనోపాధి కోసం సౌదీ వెళ్లే విషయమై భార్య హీనా తస్లీమాతో కొంతకాలంగా తగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి వారువురి మధ్య ఘర్షణ జరిగింది. తన భర్త మాట వినడం లేదని బంధుమిత్రులతో కలిసి రెహమాన్‌పై కత్తితో దాడి చేసింది. దాంతో గొంతు భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి బంధుమిత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ షుకూర్ వివరించారు.

యువకులపై కేసు నమోదు

వరంగల్ క్రైం: హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యూనివర్సిటీ జంక్షన్‌లో ఈనెల 11న డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలో పట్టుబడిన సంఘటనలో పోలీస్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు యువకులపై కేయూ పోలీసులు కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి తెలిపారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్‌తో నిందితుడు సాయికుమార్ దుర్భాశలాడడంతో పాటు తన స్నేహితులు రవీందర్, ఆరిఫ్‌ను పిలిపించుకొని మరోసారి ఘర్షణకు దిగినట్లు పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

రామన్నపేట: వరంగల్ డాల్ఫిన్ గల్లీలో నివాసముంటున్న ఉదయ్‌కిరణ్ అనే యువకుడు మంగళవారం నుంచి కనిపించడం లేదని అతడి సోదరుడు ఉదయ్‌భాస్కర్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు.

గంజాయి స్వాధీనం.. కేసు నమోదు

ఖిలా వరంగల్: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై నాగమయ్య కమాన్ వద్ద మిల్స్‌కాలనీ ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో వరంగల్ గిరిప్రసాద్ నగర్‌కు చెందిన మిద్దెల నాగబాబు వద్ద 150 గ్రాముల ఎండు గంజాయి లభ్యం కాగా, దాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ తెలిపారు.